
సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 28 । మార్చి । 2025



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్న దాన పథకానికి కరణం పవన్ కుమార్, కామాక్షి దంపతులు (అమెరికా) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



సాగుకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహర్ శనివారం (ఉదయం)
రాజమండ్రి	6.25	4.39
కాకినాడ	6.24	4.39
అమలాపురం	6.24	4.39

న్యూస్‌రీల్

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫ్యాప్టో) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం రాజమహేంద్రవరం ఎన్జీఓ హోమ్‌లో జరిగింది. ఫ్యాప్టో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నరహరి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎస్టీయూ తరఫున జేడీఐజే డానియల్ బాబు అధ్యక్షుడిగా, యూటీఎఫ్ నుంచి సెక్రటరీ జనరల్‌గా పి.జయకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.శేషబ్రహ్మం, కార్యదర్శులుగా వి.రవికుమార్, డి.దుర్గారావు, కె.డేవిడ్ లివింగ్‌స్టన్, కేవీ రమణారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పాఠశాలల విలీనాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ఫ్యాప్టో నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పలు ప్రతిపాదనలకు ఆమోదం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టర్ల సమావేశంలో జిల్లా నుంచి నివేదించిన పలు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం మండలంలో నర్సరీల పెంపకం, అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా అవకాశం కల్పించాలని కోరామన్నారు. దీనివలన 200 మందికి పైగా చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎకరం విస్తీర్ణంలో నర్సరీ పెంపకానికి దాదాపు 570 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే, తొర్రిగెడ్డకు ఆకస్మిక వరదల కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించేలా జలవనరుల శాఖ ఆధ్వర్యాన రూ.91 కోట్ల అంచనాతో రెండుసార్లు టెండర్లకు ఆహ్వానించగా ఎవ్వరూ దాఖలు చేయలేదన్నారు. మూడోసారి టెండర్ల ప్రక్రియకు అనుమతించాల్సిందిగా కోరామని తెలిపారు. కొవ్వూరు - పట్టిసీమ గోదావరి ఎడమ కాలువ రోడ్డు, బొబ్బర్లంక - ధవళేశ్వరం మధ్య 22 కిలోమీటర్ల పొడవున రెండు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.48 కోట్లతో ప్రతిపాదించామని కలెక్టర్ వివరించారు.

వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించాలి

అన్నవరం: దేవస్థానంలో భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. అన్నవరం దేవస్థానం అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేవస్థానంలో సాధ్యమైనన్ని ఎక్కువ ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయించాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేయించాలని ఆదేశించారు. అలాగే, కాయర్ కార్పెట్లను ఉపయోగించాలన్నారు. దేవస్థానం వైద్యశాల, రత్నగిరిపై నిర్వహిస్తున్న వైద్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే, అన్నిచోట్లా భక్తులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, డీసీ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు, ఈఈలు నూకరత్నం, రామకృష్ణ, ఏఈఓలు, వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి పాల్గొన్నారు.

మైనారిటీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఉపాధి కల్పన పథకంలో రుణాలు పొందడానికి ముస్లిం, క్రైస్తవ, జైన, సిక్కు, బౌద్ధ, పారశీకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎం.సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిష్టంగా తయారీ రంగానికి రూ.50 లక్షలు, సేవా రంగానికి రూ.20 లక్షల వరకూ రుణం అందిస్తారన్నారు. ప్రాజెక్టు ఏర్పాటు చేసే ప్రాంతం నుంచి లబ్ధిదారుల వర్గీకరణను బట్టి ప్రాజెక్టు విలువలో 15 నుంచి 35 శాతం వరకూ కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని వివరించారు. లబ్ధిదారు వాటా 5 శాతంతో ఏదైనా బ్యాంకు నుంచి రుణ సహాయం కల్పిస్తారన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖాదీ బోర్డు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా సంబంధిత బ్యాంకులతో సంప్రదించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. రుణం పొందగోరే అభ్యర్థుల కనీస వయసు 18 సంవత్సరాలు దాటి ఉండాలన్నారు. గరిష్ట వయో, ఆదాయ పరిమితులు లేవని తెలిపారు. తయారీ రంగంలో రూ.10 లక్షలు పైబడిన ప్రాజెక్టులు, సేవా రంగంలో రూ.5 లక్షలు పైబడిన ప్రాజెక్టుల స్థాపనకు అభ్యర్థులు కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. కొత్త ప్రాజెక్టులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, అవసరమైన చోట ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్, గ్రామీణ ప్రాంత ధ్రువీకరణ, డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు, విద్య, సాంకేతిక, ఈడీపీ శిక్షణ ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సునీల్‌కుమార్ సూచించారు.

ఉపపోరు.. ఫ్యాన్ జోరు

- రెండు కో ఆప్షన్ పదవుల్లో ఏకగ్రీవంగా ఎన్నిక
- బిక్కవోలు ఎంపీపీ స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ
- ప్రశాంతంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికలు
- అనైతిక విధానానికి తెర తీసిన కూటమి నేతలు



పోలీసు బందోబస్తు నడుమ బిక్కవోలు ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ



రంగంపేటలో వైఎస్సార్ సీపీ నుంచి కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన వంశీనాథ్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి బీవీ గిరి

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లావ్యాప్తంగా రెండు మండల కో ఆప్షన్ సభ్యులు, ఒక ఎంపీపీ స్థానానికి గురువారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పదవుల్లో కొనసాగుతూ మృతి చెందిన వారి స్థానాలకు, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సభ్యుల రాజీనామాలతో ఈ ఎన్నికలు నిర్వహించారు. స్థానిక సంస్థల్లో దొడ్డిదారిన పెత్తనం చేజిక్కించుకునేందుకు ఇటీవల కూటమి నేతలు పలుచోట్ల కుట్రలకు తెర తీస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉప ఎన్నికల్లో కొన్ని చోట్ల అవి ఫలించగా.. కొన్నిచోట్ల ఫ్యాన్ హవా కొనసాగింది. రంగంపేట, పెరవలి మండలాల కో-ఆప్షన్ సభ్యులుగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. కూటమి పార్టీలకు తగిన బలం లేకపోవడంతో ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు.

అయితే, బిక్కవోలు ఎంపీపీ స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. ఎన్నికకు వైఎస్సార్ సీపీ సభ్యులు గైర్హాజరవడంతో కమలం పార్టీకి విజయం సులువైంది. ఈ పదవిని దక్కించుకునేందుకు ఆది నుంచే ఇతర పార్టీల సభ్యులను ప్రలోభాలకు గురి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనైతిక రీతిలో ఒక్కొక్కరిగా పార్టీలో చేర్చుకుని ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు సమాచారం.

రంగంపేట

గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రంగంపేట మండలంలోని 20 ఎంపీటీసీ స్థానాలకు గానూ వైఎస్సార్ సీపీ 19 కైవసం చేసుకుంది. మండల కో ఆప్షన్ సభ్యుడిగా వ్యవహరిస్తున్న కొల్లాటి రత్నబాబు అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీకి చెందిన వంశీనాథ్ ఎన్నికయ్యారు. 19 ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకి, ఒక్కరు మాత్రమే టీడీపీకి మద్దతు తెలిపారు.

పెరవలి



పెరవలిలో కో ఆప్షన్ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ వజీరుద్దీన్

ఈ మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో కో ఆప్షన్ సభ్యుడిగా ఉన్న షేక్ ఇస్మాయిల్ మృతి చెందారు. ప్రస్తుతం ఆయన తండ్రి షేక్ వజీరుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్‌లో 13 మంది వైఎస్సార్ సీపీ, ఐదుగురు జనసేన, ఇద్దరు టీడీపీ సభ్యులున్నారు. ఎవరైనా ఏదైనా పదవిలో ఉండి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని, దీనికి మిగిలిన పక్షాలు సహకరించాలనే సంప్రదాయం ఇక్కడ అమలైంది. దీంతో వజీరుద్దీన్‌కు వైఎస్సార్ సీపీతో పాటు టీడీపీ, జనసేన సభ్యులు మొత్తం 19 మంది మద్దతు తెలిపారు. ఎన్నికకు ఒకరు గైర్హాజరయ్యారు.

కమలం ఖాతాలో బిక్కవోలు

బిక్కవోలు ఎంపీపీ స్థానం కమలం ఖాతాలో పడింది. ఈ మండల పరిషత్‌లో మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వీరిలో తొమ్మిది మంది బీజేపీ, ఒకరు టీడీపీ తరఫున మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. దీంతో బీజేపీ నుంచి ఎంపీపీ అభ్యర్థిగా తేతలి సుమ పోటీకి దిగారు. వైఎస్సార్ సీపీ సభ్యులు లేకపోవడం, కూటమి సభ్యులు మద్దతు తెలపడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీకి రాష్ట్రంలో దక్కిన తొలి ఎంపీపీ పదవి ఇదేనని చెప్పవచ్చు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఎన్నికల అధికారిగా పంచాయతీరాజ్ శాఖ డీఈ అచ్యుత రామారెడ్డి వ్యవహరించారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలోనే ఉండి మరీ ఎన్నిక జరిపించడం గమనార్హం. వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ ఎంపీపీ జ్యోతిర్మయి ఈ ఎన్నికకు రాకపోవడంతో ఆ పార్టీకి చెందిన మిగిలిన ఎంపీటీసీ సభ్యులు కూడా గైర్హాజరయ్యారు.

ఆది నుంచీ ప్రలోభాల పర్వం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ స్థానిక సంస్థల సభ్యులను ప్రలోభాలకు గురి చేసే పర్వానికి తెర లేపింది. తమ పార్టీ తీర్థం పుచ్చుకోవాలని బెదిరింపులకు దిగడంతో చేసేది లేక కొందరు వైఎస్సార్ సీపీ సభ్యులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారు. మరి కొంత మంది డబ్బులకు ఆశ పడి మారుతున్నారు. బిక్కవోలు మండలంలోని 20 ఎంపీటీసీ స్థానాలను గతంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. దీంతో వైఎస్సార్ సీపీ నుంచి ఎంపీపీగా జోతిర్మయి కొనసాగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు రంగాపురం ఎంపీటీసీ సభ్యుడు కేతఏసురత్నం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల సమయంలో బలభద్రపురం-3 ఎంపీటీసీ సభ్యుడు చిన్నం వీర రాఘవరెడ్డి బీజేపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం. బిక్కవోలు-1 నుంచి జంప వెంకటలక్ష్మి, బిక్కవోలు-3 నుంచి గొర్రెల భాగ్యలక్ష్మి, బిక్కవోలు-4 నుంచి తొండపు శాంతి శ్రీలక్ష్మి, ఊలపల్లికి చెందిన వైస్ ఎంపీపీ పెంకే మంగయమ్మ, బండారు శివ బీజేపీలో చేరారు. అనైతిక విధానాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ సభ్యులు ఈ ఎన్నికకు హాజరు కాలేదు. ఎంపీపీ పదవి ఎర వేసి మరీ ప్రస్తుత అభ్యర్థిని బీజేపీలో చేర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రజాస్వామ్యానికి విఘాతం



స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం చూస్తుంటే రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. ప్రజల ఓట్లతో గెలిచి, వివిధ పదవుల్లో కొనసాగుతున్న వారిని బలవంతంగా ఆ పదవుల నుంచి దింపే ప్రక్రియకు నాంది పలకడం దారుణం. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో బుద్ధి చెబుతారు.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

రూ.30.86 లక్షల హుండీ ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ హుండీల ద్వారా రూ.28,86,128, అన్నదాన ట్రస్ట్ హుండీల ద్వారా రూ.1,99,937 కలిపి మొత్తం రూ.30,86,065 ఆదాయం లభించిందని అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. దీంతో పాటు 19.500 గ్రాముల బంగారం, 260 గ్రాముల వెండి, మూడు విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించాయన్నారు. మొత్తం 120 రోజులకు గాను నిర్వహించిన ఈ హుండీల లెక్కింపును దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు బీఎల్ నరసింహారావు పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకుడు అప్పారావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న 11 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లవరం (గోకవరం మండలం) ఉప సర్పంచ్‌గా లంకా ప్రసన్న, పెనకనమెట్ట (కొవ్వూరు) కొడమంచిలి వెంకటరావు, గోపాలపురం వి.అమర్‌ప్రసాద్‌రెడ్డి, కొవ్వూరుపాడు జానాపాటి నాగమణి, వెంకటాయపాలెం (గోపాలపురం) వడ్లమూడి రాజేంద్రప్రసాద్, తాడిపూడి (తాళ్లపూడి) పిట్టా తమ్మారావు, లక్ష్మీనరసాపురం శీలం శ్రీనివాస్ (అనపర్తి), మర్రిపూడి నూకతట్టి అప్పాయమ్మ (రంగంపేట), మురమండ (కడియం) యర్రంశెట్టి వీరబాబు, మునికూడలి (సీతానగరం మండలం) ఉప సర్పంచ్‌గా అనిమెల్లి సత్యవేణి ఎన్నికయ్యారని వివరించారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన

- మెయిన్స్ పరీక్ష తేదీలు ప్రకటించాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు

కాకినాడ సిటీ/కాకినాడ క్రైం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, వెంటనే స్పందించి, కోర్టు కేసులు క్లియర్ చేసి, మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించాలని, లేకుంటే చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న హెచ్చరించారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన కాకినాడలో గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం, కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ, గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6,100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు. జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది హాజరయ్యారన్నారు. వీరిలో 92 వేల మంది అర్హత సాధించారని, రెండేళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారని చెప్పారు. దీనిపై వెంటనే కోర్టు కేసులు పరిష్కరించి, మెయిన్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. ఇప్పటికే పోలీసు శాఖలో 20 వేల వరకూ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి సంగతేమిటని ప్రశ్నించారు. మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూము అద్దెలు చెల్లించలేక, పుస్తకాలు కొనలేక, భార్యను, కుటుంబాన్ని వదిలేసి చదువుకుంటూంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఆందోళనకారులు దుయ్యబట్టారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ గొంతు.. అధికారంలోకి రాగానే మూగబోయిందని విమర్శించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పీడీ ప్రసాద్, జిల్లా నాయకుడు టి.రాజా మాట్లాడుతూ, నిరుద్యోగ యువతతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. పది నెలల్లో ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వందలాదిగా కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

రత్నగిరిపై 'చెత్త' వివాదం



దేవస్థానంలో చెత్త తరలింపునకు నిలిపి ఉంచిన ట్రక్కు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో 'చెత్త' వివాదం తలెత్తింది. వివరాలివీ.. అన్నవరం దేవస్థానంలో వ్రతాల్లో ఉపయోగించిన పత్రి, పువ్వులు, తమలపాకులు, ఆలయ ప్రాంగణంలో చెత్తను తరలించే పనిని గతంలో శానిటరీ కాంట్రాక్టర్ నిర్వహించేవారు. గత నెలాఖరు వరకూ ఈ కాంట్రాక్టును కేఎల్‌టీఎస్ సంస్థ నిర్వహించింది. ఈ నెల 1 నుంచి ఆ సంస్థ ఆ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగింది. దీంతో కొత్తగా శానిటరీ కాంట్రాక్ట్ ఖరారయ్యేంత వరకూ దేవస్థానంలో పారిశుద్ధ్య పనులకు 349 మంది పని వారిని సమకూర్చే పనిని గుంటూరుకు చెందిన కనకదుర్గ సర్వీసెస్‌కు అప్పగించారు. ఇది కూడా టెండర్ పిలవకుండా అప్పగించడం వివాదాస్పదమైంది. కాగా, ఒక ట్రాక్టర్, రెండు ట్రక్కులు, ట్రాక్టర్‌కు అవసరమయ్యే డీజిల్, ఇతర నిర్వహణ ఖర్చులు భరిస్తూ.. దేవస్థానంలో చెత్త తరలించే పనిని నెలకు రూ.60 వేలతో అప్పగించారు. టీడీపీలోని ఒక ద్వితీయ శ్రేణి నాయకుడి సిఫారసుతో ఆ పార్టీ కార్యకర్తకు ఏకపక్షంగా ఈ పని అప్పగించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గతంలో చెత్త ట్రాక్టర్‌ను యడ్ల కృష్ణ నిర్వహించేవారు. తాను రూ.43 వేలకే చెత్త తరలిస్తానని దేవస్థానం అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశానని, అయితే, తన దరఖాస్తు కూడా తీసుకోలేదని ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో తన దరఖాస్తును దేవదాయ శాఖ కమిషనర్‌కు, దేవస్థానం చైర్మన్, ఈఓలకు ఈ నెల 3న రిజిస్టర్డ్ పోస్టులో పంపించానని చెబుతున్నారు. దీనిపై దేవస్థానం అధికారులు స్పందించలేదని చెప్పారు. ఇదిలా ఉండగా, రూ.43 వేలతో చెత్త తరలిస్తామంటూ తన వద్దకు అసలు ఎటువంటి దరఖాస్తూ రాలేదని ఈఓ వీర్ల సుబ్బారావు 'సాక్షి'కి చెప్పారు. తపాలా ద్వారా పంపించి ఉంటే తనకు ఎందుకు ఇవ్వలేదో సంబంధిత అధికారులను వివరణ కోరానన్నారు. దరఖాస్తుదారు తనను కలిసి, దరఖాస్తు అందిస్తే పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.9.90 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను గురువారం తెరచి ఆదాయం లెక్కించారు. గడచిన 57 రోజులకు గాను హుండీల ద్వారా రూ.9.90 లక్షల ఆదాయంగా వచ్చిందని ఈఓ యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యుడు మోకా వెంకట సుబ్బారావు, దేవస్థానం అర్చకుడు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, వివిధ ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు హుండీల ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

లబ్ధిదారుల పరేషన్

- 1,36,803 మందికి పూర్తి కాని ఈ-కేవైసీ
- నెలాఖరుతో ముగియనున్న గడువు
- ఆందోళనలో రేషన్ కార్డుదారులు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలు నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు ఇచ్చిన సదరం సర్టిఫికెట్లపై పునఃపరిశీలన చేయించింది. తాజాగా రేషన్ కార్డులకు ఈ-కేవైసీ చేయించాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం 5,64,994 రేషన్ కార్డులున్నాయి. వీటిలో 15,77,393 మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటి వరకూ 14,40,590 మందికి ఈ-కేవైసీ పూర్తి చేశారు. ఇంకా 1,36,803 మందికి ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. రేషన్ కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుకూ ఈ-కేవైసీ చేయకపోతే ఏప్రిల్ రేషన్ ఇవ్వబోరంటూ క్షేత్ర స్థాయిలో ప్రచారం జరుగుతోంది. దీంతో, రేషన్ కార్డుల్లో కోత పెట్టేందుకే కూటమి ప్రభుత్వం ఈ-కేవైసీ ప్రక్రియను తెర పైకి తెచ్చిందని లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్నీ ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈ-కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ-కేవైసీ అవసరం లేదు. మిగిలిన వారు రేషన్ డీలర్లు, వీఆర్ఓలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈ-కేవైసీ చేయించుకోవాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

పేదల పొట్ట కొట్టొద్దు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎన్నికల హామీలు అమలు చేయకపోగా.. ఉన్న పథకాలకు కత్తెర వేస్తోందని లబ్ధిదారులు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఈ-కేవైసీ పేరిట బియ్యం కూడా ఎగ్గొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతున్నారు. పేదల పొట్ట కొట్టొదని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్డులోని సభ్యులకు ఒక్కొక్కరికి ప్రతి నెలా 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారని, అదే ప్రభుత్వానికి భారమైందా అని ఆవేదన చెందుతున్నారు. ఈ-కేవైసీ పూర్తి కాని వారికి సైతం బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మండలాల వారీగా రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ వివరాలు (గురువారం వరకూ)

మండలం	రేషన్ కార్డుల్లో మొత్తం సభ్యులు	ఈ-కేవైసీ పూర్తయినవారు	ఈ-కేవైసీ పెండింగ్
సీతానగరం	64,787	60,297	4,470
కోరుకొండ	74,967	67,519	7,448
గోకవరం	62,120	56,488	5,632
రంగంపేట	55,890	50,900	4,990
రాజానగరం	1,02,581	93,549	9,032
రాజమహేంద్రవరం రూరల్	1,45,210	1,33,227	11,983
కడియం	82,412	75,388	7,024
అనపర్తి	58,273	54,698	3,575
బిక్కవోలు	60,450	55,928	4,522
రాజమహేంద్రవరం అర్బన్	2,39,828	2,18,929	20,900
తాళ్లపూడి	46,589	42,739	3,850
గోపాలపురం	57,952	51,560	6,392
నల్లజర్ల	75,926	69,635	6,291
దేవరపల్లి	71,239	63,807	7,432
చాగల్లు	58,664	53,884	4,780
కొవ్వూరు	92,892	85,172	7,720
నిడదవోలు	97,059	88,887	8,172
ఉండ్రాజవరం	65,407	59,676	5,731
పెరవలి	65,166	58,307	6,859

వలసదారుల్లో ఆందోళన

ఇదిలా ఉండగా ఉపాధి, విద్య, ఉద్యోగ అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఈ-కేవైసీ విషయమై ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి ఈ-కేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే, సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు దీనికి ఏవిధంగా రాగలరని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ-కేవైసీకి మరింత గడువు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు ఈ-కేవైసీ వెంటనే పూర్తి చేయాలంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.



విద్యార్థులకు ఈ-కేవైసీ చేస్తున్న దృశ్యం

ఆందోళన వద్దు



ఈ నెల 31వ తేదీలోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలని చెప్పాం. చిన్న పిల్లలకు, వృద్ధులకు వేలి ముద్రలు పడకపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. ఈ కారణాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ఈ-కేవైసీ వేయకపోయినా రేషన్ సరకులు నిలుపు చేయం. ఈ నాలుగు రోజుల్లో ఈ-కేవైసీ పూర్తి చేస్తాం. లబ్ధిదారులు ఎటువంటి ఆందోళనా చెందనవసరం లేదు.

– ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (ఇన్‌చార్జి)

క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ బూత్‌ కమిటీల విభాగం జోనల్‌ అధ్యక్షుడిగా బీవీఆర్‌ చౌదరి



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్‌ సీపీ బూత్‌ కమిటీల విభాగం జోనల్‌ (ఉమ్మడి తూర్పు,పశ్చిమగోదావరిజిల్లాలు) అధ్యక్షుడిగా బొల్లిన వెంకటేశ్వరరావు (బీవీఆర్‌ చౌదరి)ని నియమిస్తూ వైఎస్సార్‌ సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన వెలువరించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగింది. ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీవీఆర్‌ చౌదరి గతంలో సైతం బూత్‌ కమిటీల అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీలో పలు కీలక పదవుల్లో సేవలను అందించారు. తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పదవికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని బీవీఆర్‌ చౌదరి తెలిపారు. పార్టీ బలోపేతం కోసం శ్రమించనున్నట్లు పేర్కొన్నారు.

పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై విచారణ జరపాలి

అల్లవరం: తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ డిమాండ్‌ చేశారు. రాజమండ్రి విమానాశ్రయం నుంచి కొంతమూరు హైవేపై వస్తున్న పాస్టర్‌ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ముఖంపై గాయాలు ఉన్నాయని, ఇది హత్యగా అభిప్రాయపడుతున్నారని తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రవీణ్‌ కుటుంబానికి ఇజ్రాయిల్‌ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పురుగు మందు తాగి వృద్ధురాలి మృతి

ముమ్మిడివరం: జీవితంపై విరక్తితో ఓ వృద్ధురాలు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలో గేదెల్లంక హనుమాన్‌ సెంటర్‌కు చెందిన రాయుడులక్ష్మి(74) బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అమలాపురం కిమ్స్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. గబదేళ్లుగా అల్సర్‌ వ్యాధితో బాధపడుతూ తగ్గక పోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడింది. భర్త పట్టాభి పక్షవాతంతో మంచాన పడ్డాడు. లక్ష్మికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు గతంలో మృతిచెందాడు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాయి సాగు.. లాభాల బాగు




భారీగా కాసిన బొప్పాయి కాయలు



చిన బ్రహ్మదేవంలో సాగయిన బొప్పాయి

- మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- వేసవిలో లబ్ధి పొందుతున్న మెట్ట రైతులు

పెద్దాపురం: ప్రస్తుత వేసవి సీజన్‌లో ఆరోగ్యప్రదమైన ఫలాల్లో బొప్పాయి ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలతో పాటు కోస్తాలో అధికంగా పండించే బొప్పాయి మెట్ట ప్రాంతంలోనూ రైతులకు మంచి ఆదాయాలను సమకూరుస్తోంది. ప్రధానంగా మెట్ట కేంద్రమైన పెద్దాపురం మండలంలోని చినబ్రహ్మదేవం, జె.తిమ్మాపురం, కట్టమూరు. ఆర్‌బీపట్నం, కొత్తూరు, కొండపల్లి, ఆనూరు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో బొప్పాయి సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. నారు దశ మొదలు ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, కోత, దిగుబడి వంటి అంశాలపై ఉద్యాన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేయడంతో బొప్పాయి సాగు లాభాలు చేకూరుస్తోంది.



ఎరువుల యాజమాన్యం

చెట్టు వయస్సును బట్టి ఎరువులను వినియోగించాలి. ఏకలింగాశ్రయ దీర్ఘకాలిక రకాల బొప్పాయి ఒక్క మొక్కకు పది కిలోల పశువుల ఎరువు, 12 కిలోల వేప లేదా ఆముదపు పిండి, 500 గ్రాముల యూరియా, 1.6 కిలోల సింగిల్‌ సూపర్‌ ఫాస్ఫేట్‌ 800 గ్రాములు మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాష్‌ ఎరువులను వెయ్యాలి. రెండు నెలలకోసారి ఏడాదిలో ఆరుసార్లు ఎరువులను వెయ్యాలి. సూక్ష్మధాతు లోప నివారణకు ఐదు గ్రాముల జింక్‌ సల్ఫేట్‌, ఒక గ్రాము బోరాక్స్‌ లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. డ్రిప్‌ ద్వారా ఎరువులను అందించే పక్షంలో 13.5 గ్రాములు యూరియా, 19.5 గ్రాముల మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాషియం, వారం రోజుల వ్యవధితో 48 వారాలు ఇవ్వాలి. ఏకవార్షిక రకాలకు ఎరువులను ఏడవ నెల వరకు అందించాలి.

ఫెర్టిగేషన్‌

సిఫారసు చేసిన ఎరువులను కరగబెట్టి వడగట్టిన తరువాత ఫెర్టిగేషన్‌ ట్యాంక్‌ లేదా ఫుట్‌ స్ప్రేయర్‌ ద్వారా గాని డ్రిప్‌ మెయిన్‌ పైపులోకి ప్రవేశపెట్టాలి. భాస్వరపు ఎరువుని ఫాస్ఫేట్‌ రూపంలో ప్రతీ రెండు నెలలకోసారి 260 గ్రాములు చెట్టుపాదులో కలపాలి.

నీటి యాజమాన్యం

మొక్క మొదళ్ల దగ్గర నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పిల్ల పాదులు (డబుల్‌ రింగ్‌ పద్ధతి) తయారు చేసి నీరు పారించాలి. డ్రిప్‌ పద్ధతిలో నీరు పెడితే అధిక దిగుబడులు సాధించవచ్చు. డ్రిప్‌ ద్వారా చిన్న మొక్కలైతే రెండు రోజులకోసారి 8 లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు వేసవిలో ప్రతీ 20–25 లీటర్ల నీటిని అందే విధంగా డ్రిప్పర్లు అమర్చుకోవాలి. వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు అందించాలి.

కోత, దిగుబడి

మంచి సైజు వచ్చిన కాయలను చెట్టు మీద మాగనీయకూడదు. వాటిని కోసి పేపర్‌తో చుట్టి రవాణా చేసుకోవాలి. నాటిన 9వ నెల నుంచి రెండున్నర సంవత్సరాల వరకు పంటనిస్తుంది. ద్విలింగ పుష్పాల నుంచి ఎదిగే కాయలు తక్కువ పొడవుతో గుండ్రంగా ఉంటాయి. అదే ఆడపుష్పాల నుంచి ఎదిగే కాయలు పొడవుగా, కోలగా ఉంటాయి. దిగుబడి ఎకరాకు 35 నుంచి 40 టన్నుల వరకు ఉంటుంది.

బొప్పాయి సాగులో మంచి ఆదాయం



మెట్ట ప్రాంతంగా కావడంతో ఎక్కువ అపరాలు, పండ్ల తోటలను సాగు చేస్తుంటాం. ప్రధానంగా మామిడి, జీడిమామిడితో పాటు బొప్పాయి సాగులోను మంచి ఆదాయం వస్తుంది. అధికారుల సూచనలతో మరింత జాగ్రత్తగా సాగు చేపట్టడంతో బొప్పాయి మంచి దిగుబడి వచ్చింది.

–ఆచంట శివ, రైతు, చిన బ్రహ్మదేవం, పెద్దాపురం మండలం

ఆరోగ్యానికి చాలా మంచిది



బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మంచిది. బొప్పాయిలో విటమిన్‌ సీ, ఏ యాంటి ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపర్చడంలో సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచడంతో పాటు కొన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది.

–డాక్టర్‌ భ్రమరాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్‌)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ట్రాక్టరు కింద పడి వ్యక్తి మృతి

రౌతులపూడి: మండలంలోని రాజవరంలో దార్ల వీరాచార్యులు(65) గురువారం ట్రాక్టరు కిందపడి మృతిచెందాడు. రాజవరం నుంచి గంగవరం వైపు వెళ్తున్న ట్రాక్టరు ట్రక్కు వెనుక నుంచి సైకిల్‌పై వస్తున్న మృతుడు వీరాచార్యులుకు తగలటంతో వెనుక చక్రం కింద పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు వీరాచార్యులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

టీడీపీ వేధింపులు తాళలేక ఫీల్డ్‌ అసిస్టెంట్‌ ఆత్మహత్యా యత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌ రాజేశ్వరి

మండపేట: టీడీపీ కార్యకర్తల వేధింపులు తట్టుకోలేక ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌ అసిస్టెంట్‌ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా మండపేటలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. మండలంలోని పాలతోడు గ్రామానికి చెందిన తాతపూడి రాజేశ్వరి 16 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌ అసిస్టెంట్‌గా అదే గ్రామంలో పని చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన తల్లిపై గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తల బెదిరింపులు ఎక్కువయ్యాయని ఆమె కుమారుడు నవీన్‌ తెలిపారు. తన తల్లిపై లేనిపోని అభియోగాలు మోపి, ఉద్యోగంలో నుంచి తీసేస్తున్నామని చెప్పారన్నారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఉన్నవి లేనివి చెప్పి, తన తల్లిని ఉద్యోగం నుంచి తొలగించాలంటూ ఒత్తిడి చేశారని చెప్పారు. గతంలో ఉపాధి హామీ పనులపై ఆడిట్‌ జరిగితే గ్రామంలోని ఒకే కుటుంబంలో రెండు జాబ్‌ కార్డులున్నాయంటూ ఆడిట్‌ అధికారులు తన తల్లిని ప్రశ్నించారని, దీనిపై కలెక్టర్‌కు, డ్వామా పీడీకి వివరణ ఇచ్చారని చెప్పారు. దీనిని పరిశీలించిన ఉన్నతాధికారులు ఆమె ఉద్యోగానికి ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పారన్నారు. అయితే గ్రామంలోని టీడీపీ నాయకులు మందపల్లి శ్రీనుబాబు, మందపల్లి రాజబాబు, తాతపూడి లాజర్‌, పండా వీర్రాజు తన తల్లిపై ఎమ్మెల్యే వేగుళ్లకు నిరాధారమైన ఆరోపణలు చేశారని, ఈ నేపథ్యంలో ఆమెను ఉద్యోగం తొలగించారని చెప్పారు. సుమారు మూడు నెలలుగా తన తల్లిపై కక్ష సాధిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం పేరు చెప్పి తన తల్లి రూ.40 లక్షల వరకూ సంపాదించిందంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. పైగా ఆమె ఉద్యోగాన్ని వేరొకరికి ఇప్పిస్తామంటూ వారి నుంచి రూ.3 లక్షల లంచం కూడా తీసుకున్నారని నవీన్‌ ఆరోపించారు. డబ్బు కోసం తన తల్లిపై లేనిపోని నిందలు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఉత్తమ అవార్డులు అందుకున్న తన తల్లి టీడీపీ శ్రేణుల వేధింపుల నేపథ్యంలో ఈ నెల 25న పురుగుల తాగి, చచ్చిపోవాలనుకున్నదని విలపించారు. ఆమెకు ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని నవీన్‌ చెప్పారు.

వ్యక్తి దారుణ హత్య

- చేయి నరికి తీసుకెళ్లిన దుండగులు
- తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో ఘటన



ప్రభాకర్‌ (ఫైల్‌)

కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామ శివారున అరటి తోటలో పెండ్యాల ప్రభాకర్‌ (45)ను బుధవారం రాత్రి కత్తులతో నరికి పాశవికంగా హత్య చేశారు. దొమ్మేరు గ్రామానికి చెందిన పెండ్యాల ప్రభాకర్‌ గత కొన్నేళ్లుగా కొవ్వూరులో నివాసం ఉంటున్నారు. సేంద్రియ వ్యర్థాలను సేకరించే వ్యాపారం చేస్తున్నారు. గత రాత్రి పార్టీకి రమ్మని ఫోన్‌ రావడంతో బయటికి వెళ్లారు. రాత్రి పది గంటల నుంచి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వచ్చింది. గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ప్రభాకర్‌పై కత్తితో దాడి చేసి కుడి చేయి హస్తాన్ని నరికి తీసుకుని వెళ్లిపోయారు. హత్యకు గురైన ప్రాంతం చుట్టుపక్కల చేయి కోసం పోలీసులు గాలించారు. క్లూస్‌ టీమ్‌, డాగ్‌ స్క్వాడ్‌ ఘటన స్థలంలో నుంచి వివరాలు సేకరించాయి. తలపైన బలంగా కత్తితో దాడిచేసి హతమార్చారు. చేతి గుర్తు వరకు నరికి వేశారు. మృతుడు ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయలుదేరగా మార్గమధ్యలో మరో వ్యక్తి ఆయనతో ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి ఎవరనే అంశంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. చేతికి బంగారు కడియం, బంగారు ఉంగరాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ కారణం చేతనే చేతిని నరికి పెట్టుకెళ్లారా అన్న కోణంలోను పోలీసులు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభాకర్‌కు వచ్చిన ఫోన్‌ కాల్స్‌ ఆధారంగా విచారణ చేస్తున్నారు. అసలు పార్టీకి పిలిచిందెవరు? మోటారు సైకిల్‌ వెనుక కూర్చొని వెళ్లిన వ్యక్తి ఎవరు.? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఒంటిపై ఉన్న బంగారం కోసం హత్య చేశారా...లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలోను పోలీసులు దృష్టి సారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఏడాది క్రితమే వివాహం అయ్యింది.

లోక్‌ అదాలత్‌పై ఉన్నత స్థాయి సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పర్మినెంట్‌ లోక్‌ అదాలత్‌ ఫర్‌ పబ్లిక్‌ యుటిలిటీ సర్వీసెస్‌ చైర్మన్‌ ఏ.గాయత్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్‌.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి, ఎన్‌.శ్రీలక్ష్మి మాట్లాడుతూ, విద్యుత్‌, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్‌, బ్యాంకింగ్‌ వంటి సేవలకు సంబంధించిన సమస్యలు, వివాదాలను పబ్లిక్‌ యుటిలిటీ సర్వీసెస్‌ లోక్‌ అదాలత్‌ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. దాదాపు రూ.కోటి వరకు సమస్యలను ఇందులో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ తరహా వివాదాలలో కోర్టు ఫీజు లేకుండా, రాజీ మార్గం ద్వారా సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు.

వృత్తులను కాపాడడమే అసలైన సనాతనం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



విలసవిల్లి చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఉప్పలగుప్తం: చేనేతను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలపై సీపీఎం నిర్వహించే ప్రజా చైతన్య యాత్ర సీపీఎం జిల్లా కన్వీనర్‌ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని విలసవిల్లి, నంగవరం, భీమనపల్లి గ్రామాల్లో గురువారం సాగింది. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలతో సీపీఎం నాయకులు చర్చించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకుని వచ్చి ప్రతీ ఇంటికి ఉపాధి కల్పిస్తానని కబుర్లు చెబుతున్నారు తప్ప రాష్ట్రంలో ప్రధాన పరిశ్రమ అయిన చేనేత పరిశ్రమను మరుగున పడవేశారన్నారు. సనాతన ధర్మం పాటించాలని చెప్పే పాలకులకు సనాతన వృత్తులను కాపాడుకోవడమే అసలైన సనాతన ధర్మం అని గుర్తుచేస్తున్నానన్నారు. ముడి సరకు ధరలను అధికంగా పెంచి పాలకులు నేతన్నల పొట్ట కొడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి భరోసా నేతన్న నేస్తం కింద ఏడాదికి చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇచ్చేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నేత కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న కనీస చర్యలు లేవని అన్నారు. ప్రభుత్వం పీ–4 పేరుతో ప్రజలను మోసం చేసి కార్పొరేట్‌ రంగాలను అభివృద్ధి చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా నేత కార్మికులు తాము పడుతున్న కష్టాలను సీపీఎం బృందానికి వివరించారు. అనంతరం చేనేత కార్మికుల మగ్గాలను వారు నేత నేసే విధానాన్ని తెలుసుకున్నారు. భీమనపల్లి కేఎఫ్‌డబ్ల్యూ కాలనీలోను, నంగవరం లోను సీపీఎం బృందం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా గుర్తించామని, ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. బి.బలరామ్‌, ఆంగ్ర మల్యాద్రి, జి.దుర్గాప్రసాద్‌, నూకల బలరామ్‌, టి.నాగవరలక్ష్మి, కె.కృష్ణవేణి, పీతల రామచంద్రరావు పాల్గొన్నారు.

నగదు రహిత పాదయాత్రకు స్వాగతం

ఆదిత్య పూర్వ విద్యార్థికి అభినందనలు తెలిపిన యాజమాన్యం



ప్రో చాన్సలర్‌ సతీష్‌రెడ్డితో యూనివర్సిటీ పూర్వ విద్యార్థి

గండేపల్లి: ఐదు కేంద్ర పాలిత ప్రాంతాలను సందర్శించి, 27 రాష్ట్రాలను చుట్టి వచ్చిన ఆదిత్య పూర్వ విద్యార్థికి కళాశాలల యాజమాన్యం సాదర స్వాగతం పలికింది. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 2019 నుంచి 2023 వరకు పెట్రోలియం టెక్నాలజీ ఇంజినీరింగ్‌ విభాగంలో విద్యనభ్యసించిన తమిళనాడు రాష్ట్రం కుంభకోణంకు చెందిన ఎస్‌.తిలోత్తమన్‌ సంపూర్ణ భారతదేశ యాత్ర పేరుతో పాదయాత్రను ప్రారంభించి గురువారం కళాశాలలకు చేరుకుని చాన్సలర్‌ ఎన్‌.శేషారెడ్డి, ప్రో చాన్సలర్‌ ఎన్‌.సతీష్‌రెడ్డిని కలిసి తాను చేస్తున్న పాదయాత్ర గురించి వివరించాడు. ఈ సందర్భంగా తిలోత్తమన్‌ మాట్లాడుతూ నవంబర్‌ 11, 2024 న కుంభకోణంలో పాదయాత్రను ప్రారంభించానని, ఈ యాత్ర పూర్తి నగదు రహిత పాదయాత్ర అని కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా మార్గమధ్యలో ఎవరినైనా లిఫ్ట్‌ అడిగి ప్రయాణిస్తున్నట్టు తెలియజేశాడు. ఆయా ప్రాంతాలలో ఆలయాలు, వసతి సత్రం, అన్నదాన కేంద్రాల వద్ద ఆహారం తీసుకుంటూ ప్రయాణం సాగిస్తున్నట్టు పేర్కొన్నాడు. యువత మత్తుకు అలవాటుపడి వారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవడం, కుటుంబాలు చిన్నాభిన్నం అవడం చూశానని, ఈ యాత్ర యువతపై ఎక్కువ ప్రభావం చూపుతుందనే ఉద్దేశంతో ప్రారంభించినట్టు తెలిపాడు. కుంభకోణంలో ఏప్రిల్‌ నెలాఖరున సంపూర్ణ భారతదేశ పాదయాత్రను పూర్తిచేయనున్నట్టు పేర్కొన్నాడు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో చాన్సలర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్‌ చాన్సలర్‌ ఎంబీ శ్రీనివాస్‌, ప్రో వైస్‌ చాన్సలర్‌ ఎస్‌.రమాశ్రీ, డీన్స్‌ తిలోత్తమన్‌ను అభినందించారు.

వాడపల్లి వెంకన్నకు రూ.1.23 కోట్ల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.1.23 ఆదాయం వచ్చినట్టు దేవాదాయ –ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. 31 రోజుల అనంతరం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో గురువారం హుండీలను తెరిచి నగదు, మొక్కుబడులను లెక్కించారు. ప్రధాన హుండీల నుంచి రూ.96.99,132, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.23,27,304, బంగారం 10 గ్రాములు, వెండి 1 కేజీ 925 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు 20 వచ్చినట్టు వివరించారు. ఆలయ క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీల ద్వారా రూ 2,99,236 ఆదాయం లభించిందన్నారు. దేవదాయ శాఖ రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్‌ టీవీఎస్‌ఆర్‌ ప్రసాద్‌, గోపాలపురం గ్రూపు దేవాలయాల గ్రేడ్‌ – 3 ఈఓ బీ కిరణ్‌, ఆత్రేయపురం గ్రూపు దేవాలయాలు గ్రేడు – 3 ఈఓ బీ నరేంద్రకుమార్‌, దేవస్థానం మాజీ చైర్మన్‌ కరుటూరి నరసింహారావు, ఉప సర్పంచ్‌ పోచిరాజు బాబూరావు పాల్గొన్నారు.

నిజమైన నిందితులను అరెస్ట్‌ చేయాలి

వైఎస్సార్‌ సీపీ జిల్లా ఎస్సీ సెల్‌ డిమాండ్‌



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నల్లజర్ల: దూబచర్ల గాంధీ కాలనీ, ముసుళ్ళగుంటలలో అంబేడ్కర్‌, ఎన్టీఆర్‌ విగ్రహాలకు చెప్పుల దండలు వేసి అవమానించిన కేసులో సమగ్ర విచారణ జరిపి నిజమైన దోషులను పోలీస్‌లు అరెస్ట్‌ చేయాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా ఎస్సీ సెల్‌ డిమాండ్‌ చేసింది. గురువారం సాయంత్రం నల్లజర్లలో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్‌ నాయకులు మాట్లాడారు. ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సాలివేణు మాట్లాడుతూ ఈ విగ్రహాల విషయంలోఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఒత్తిళ్లకు లొంగి పోలీసులు సమగ్ర విచారణ జరపకుండానే వైఎస్సార్‌ సీపీ అభిమాని, సామాజిక కార్యకర్త బుడుపుల బాబ్జిపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. టీడీపీ వైఎస్సార్‌ సీపీపై బురదజల్లే కార్యక్రమం చేపట్టిందన్నారు. మా ఆరాధ్యదైవం అంబేడ్కర్‌ను ఎందుకు అవమానిస్తామని ప్రశ్నించారు. ఏదో విధంగా కేసు త్వరితగతిన పూర్తి చేయడానికి పోలీసులు ఈవిధంగా వ్యవరించారన్నారు. ఇక్కడ రెడ్‌బుక్‌ రాజ్యాంగం అమలవుతోందా అని ప్రశ్నించారు. 2024 నవంబరు 26న ద్వారకాతిరుమలలో అంబేడ్కర్‌ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసు ఇంతవరకు ఏమైందో తెలియలేదన్నారు. ఈ కేసులో నిర్దోషి, దళిత యువకుడు గోపాలపురం నియోజకవర్గ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్‌, మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు, ముప్పిడి వెంకటరత్నం, తాడిగడప శ్రీనివాసరావు, బోడిగడ్ల రాంబాబు, తోట వెంకట్రావు, గోగులమండ రాజారావు పాల్గొన్నారు.

4న చిత్రకళా వీధి ప్రదర్శన



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కమిషన్‌ చైర్‌పర్సన్‌ తేజస్వి, కల్చరల్‌ డైరెక్టర్‌ మల్లికార్జునరావు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)/రాజానగరం: నగరంలోని లాలాచెరువు రహదారిలో 'అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన'కు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి (క్రియేటివిటీ అండ్‌ కల్చరల్‌) కమిషన్‌ చైర్‌ పర్సన్‌ తేజస్వి పొడపాటి తెలిపారు.గురువారం సబ్‌ కలెక్టర్‌ కార్యాలయం సమావేశ మందిరంలో 'అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన' వాల్‌పోస్టర్‌ను కల్చరల్‌ డైరెక్టర్‌ ఎం.మల్లికార్జునరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ పి.తేజస్వి మాట్లాడుతూ రాష్ట్రంలో కళలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌ 4న ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి 500 మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా వచ్చే నిధులతో రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్‌ గ్యాలరీని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఈ వీధి ప్రదర్శన కొనసాగిస్తామని చెప్పారు. ఆమె ఆదికవి నన్నయ యూనివర్సిటీని సందర్శించి వీసీ ఆచార్య ఎస్‌.ప్రసన్నశ్రీని కలుసుకుని వీధి ప్రదర్శనపై చర్చించారు. అనంతరం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని విడుదల చేశారు.

సారా రహిత రాష్ట్రమే ధ్యేయం



ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ రాహుల్‌ దేవ్‌శర్మ

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్‌ను సారా రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయంగా ప్రభుత్వం 'నవోదయం 2.0 కార్యక్రమాన్ని రూపొందించిందని ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ రాహుల్‌దేవ్‌ శర్మ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ప్రత్తిపాడు ఎక్సైజ్‌ సర్కిల్‌ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని రిజిస్టర్లు, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం నవోదయం 2.0పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లాలోని ఎక్సైజ్‌ నేరాలు, సారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలపై సమీక్షించారు. సారాను పూర్తిగా నిషేధించేందుకు కృషిచేయాలని ఎక్సైజ్‌ సీఐలు, ఎస్సైలను ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ రాహుల్‌ దేవ్‌ శర్మ ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ రేణుక, ఎక్సైజ్‌ సూపరిటెండెంట్‌ కృష్ణకుమారి, అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరిటెండెంట్‌ జయమానిక పాల్గొన్నారు.